
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 17 । నవంబర్ । 2024



సోమశిలలో 69.798 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 69.798 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 7,079 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 50, ఉత్తరకాలువకు 550, కండలేరుకు 3 వేలు, దక్షిణకాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.76,430
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ6,937
3 శాతం జీఎస్టీతో	రూ.7,145
నవర (8 గ్రా)	రూ.57,160

గరిష్టం/కనిష్టం
30.5 /25.2

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. శనివారం గాలిలో తేమ 86 శాతం ఉంది.

న్యూస్‌రీల్

రేపు ఉద్యోగ మేళా

నెల్లూరు (టౌన్): ఏపీఎస్ఎస్‌డీసీ, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 18న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పోలీసుపరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా పారంభమవుతుందని చెప్పారు. ఈ ఉద్యోగమేళాలో మెడ్‌ప్లస్, ఎమరాల్ టైర్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఎంఫార్మసీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు ఆధార్, రెజ్యూమ్ తీసుకురావాలన్నారు.

పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 89 మందికి 87 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు శ్రీకొలను విద్యార్థులు



విద్యార్థినులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అనుమసముద్రంపేట: మండలంలోని శ్రీకొలను జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ థామస్ పీటర్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో అండర్-17 విభాగంలో కల్లూరు చెంచులక్ష్మి, అండర్-14 విభాగంలో అంబవరపు రిషిత సత్తాచాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. డిసెంబర్ 8 నుంచి 13వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని మాంసౌర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సత్కరించారు. విద్యా కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్లకు పదోన్నతులు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలకు పదోన్నతులను జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో నలుగురు ఎస్ఏలకు గ్రేడ్-2 హెచ్ఎంలుగా పదోన్నతుల కల్పించారు. కేఎన్నార్ మున్సిపల్ హైస్కూల్‌లో మ్యాథ్స్ టీచర్‌గా పనిచేస్తున్న కొండూరు రవీంద్రబాబును జెండావీధిలోని పీఎస్ఎం స్కూల్ హెడ్‌మాస్టరుగా నియమించారు. కావలిలోని మున్సిపల్ హైస్కూల్‌లో పనిచేస్తున్న ముద్దన సుజాతను అదే పాఠశాలలో హెచ్ఎంగా, కావలిలోని ఏకే మున్సిపల్ యూపీ స్కూల్‌లో పనిచేస్తున్న వల్లేటి వెంకటేశ్వర్లును కావలిలోని వెంగళరావునగర్‌లోని మున్సిపల్ హైస్కూల్, కావలిలోని ఓల్డ్ టౌన్‌లోని మున్సిపల్ హైస్కూల్లో పనిచేస్తున్న చిలకా మధుసూదన్‌ను గూడూరులోని జీఎస్సార్ మున్సిపల్ హైస్కూల్లో గ్రేడ్-2 హెడ్ మాస్టర్లుగా నియమించారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు పదోన్నతుల వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పదోన్నతులు నిర్వహిస్తామని డీఈఓ బాలాజీరావు తెలిపారు.

విస్తారంగా వర్షాలు

- విడవలూరులో అత్యధికంగా 64.6 మి.మీ. వర్షపాతం
- జిల్లా వ్యాప్తంగా సగటున 17.1 మి.మీ.

నెల్లూరు (అర్బన్): బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఐదు రోజులుగా పలుచోట్ల భారీ, మరికొన్ని చోట్ల తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. శనివారం సగటున వర్షపాతం 17.1 మి.మీ.గా నమోదైంది. అత్యధికంగా విడవలూరు మండలంలో 64.6 మి.మీ. వర్షం కురిసింది. కొడవలూరులో 47.2, బుచ్చిరెడ్డిపాళెం 45.6, కొండాపురం 38.2, కావలి 35.0, కందుకూరు 34.8, ఉదయగిరి 27.8, వలేటివారిపాళెం 26.4, ఇందుకూరుపేట 26.4, కోవూరు 25.4, నెల్లూరు అర్బన్ 25.4, నెల్లూరు రూరల్ 23.6, ఉలవపాడు 18.2, సంగం 16.2, వెంకటాచలం 16.2, లింగసముద్రం 15.6, వరికుంటపాడు 14.8, దగదర్తి 14.6, అల్లూరు 12.8, తోటపల్లిగూడూరు 12.2, సీతారామపురం 11.8, మనుబోలు 11.4, చేజర్ల 11.4, జలదంకి 9.4, గుడ్లూరు 8.2, పొదలకూరు 8.2, దుత్తలూరు 7.2, వింజమూరు 6.0, కలువాయి 5.6, అనంతసాగరం 5.6, మర్రిపాడు 5.2, అనుమసముద్రంపేట 5.0, కలిగిరి 4.0, సైదాపురం 3.4, ఆత్మకూరు 3.2, రాపూరు 2.4, బోగోలు 2.2 మి.మీ. కురిసింది. ముత్తుకూరు మండలంలో వర్షం నమోదు కాలేదు.

నాడు-నేడుకు నారా గ్రహణం

జిల్లాలో నాడు-నేడు పనులకు 'నారా' గ్రహణం పట్టింది. ఈ పనులు కొనసాగిస్తే.. ఎక్కడ ప్రభుత్వ బడులు బాగుపడి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేరొస్తొందనే దుగ్ధతో ఆ పనుల పురోగతిపై ఆరు నెలలుగా కనీసం ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదంటే ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి అద్దం పడుతోంది. 'పాడుబడిన' బడులకు కొత్త రూపు కల్పించడంతో పాటు క్షేత్రస్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పించింది. నాడు-నేడు పథకంలో తొలి విడతలో కార్పొరేట్ తలదన్నే రీతిలో సర్కారు బడులను అభివృద్ధి పరిచింది. రెండో విడతలో చేపట్టిన పనులకు నిధులు సైతం విడుదల చేసింది. ఆది నుంచి ప్రభుత్వ విద్యారంగాన్ని వ్యతిరేకిస్తున్న టీడీపీ పెద్దలు అధికారం దక్కించుకున్నాక.. ఆరు నెలల్లోనే విధ్వంసం చేశారు. ఎక్కడికక్కడ నాడు-నేడు పనులు నిలిచిపోయాయి.

- రెండో విడతలో 1,356 పాఠశాలలు, అంగన్‌వాడీలు, జీఈడీ, డైట్ కళాశాల
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.466.94 కోట్ల నిధుల మంజూరు
- రూ.190.45 కోట్లు విడుదల
- నేటికీ పేరెంట్స్ కమిటీ అకౌంట్లలో రూ.4.60 కోట్ల నిల్వ
- టీడీపీ ప్రభుత్వం వచ్చాక పైసా విడుదల చేయని వైనం
- జిల్లా వ్యాప్తంగా నిలిచిపోయిన పనులు
- సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



కేఎన్నార్ ప్రాథమిక పాఠశాలలో నిలిచిన నాడు-నేడు పనులు



నెల్లూరు (టౌన్): జిల్లాలో రెండో విడత నాడు-నేడు పనులు స్తంభించాయి. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు, విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ ఉండి విద్యాశాఖను పూర్తిగా గాలికి వదిలేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొలి విడతలో 1,060 పాఠశాలలకు రూ.231.60 కోట్లు నిధులు విడుదల చేసి ఆయా పాఠశాలల్లో 9 రకాల వసతులను కల్పించింది. గత విద్యా సంవత్సరంలో రెండో విడతలో భాగంగా 1,356 పాఠశాలలు, అంగన్‌వాడీలు, బీఈడీ, డైట్ కళాశాలను ఎంపిక చేసింది. వీటిల్లో మౌలిక వసతులు కల్పించేందుకు రూ. 466.94 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో ఆయా పాఠశాలల్లో పనులు ప్రారంభించి చేపట్టారు. దాదాపు 70 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు నెమ్మదించాయి. అయితే తాజాగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ఆరు నెలలు గడుస్తున్నా.. ఆయా పనులకు సంబంధించి పైసా నిధులు కూడా విడుదల చేయలేదు. ఈ ఆరు నెలల్లో ఒక్కసారి కూడా విద్యాశాఖతో నాడు-నేడు పనులపై సమీక్షించలేదంటే ఈ ప్రభుత్వానికి సర్కార్ బడులంటే ఎంత నిర్లక్ష్యానికి అర్థం పడుతోంది. రాష్ట్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడటంతో అటు పేరెంట్స్ కమిటీ, ఇటు హెచ్ఎం, ఇంజినీరింగ్ అధికారులు మౌలిక వసతుల కల్పనను పూర్తిగా గాలికి వదిలివేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

70 శాతం పనులు పూర్తి

రెండో విడత నాడు-నేడు పనుల్లో గత ప్రభుత్వ హయాంలోనే దాదాపు 70 శాతం మేర పనులు జరిగాయి. మంజూరైన 1356 విద్యా సంస్థల్లో 543 అదనపు తరగతి గదులు, 343 ప్రహరీలు, 579 ఇంగ్లిష్ ల్యాబ్స్, 412 కిచెన్ షెడ్లు, 940 టాయిలెట్లు, రన్నింగ్‌వాటర్, 925 ఎలక్ట్రిక్ వర్క్స్, 936 డ్రింకింగ్ వాటర్, 935 బెంచీలు, కుర్చీలు, 919 పెయింటింగ్, 925కు మేజర్, మైనర్ రిపేర్స్, 931 గ్రీన్‌చాక్ బోర్డులు తదితర వాటిని నిర్మించాల్సి ఉంది. 1,356 భవనాల్లో అప్పట్లోనే 905 భవనాల్లో పనులు ప్రారంభమయ్యాయి. అందులో సుమారు 600 భవనాల్లో పనులు పూర్తి చేశారు. మిగిలిన వాటిల్లో వివిధ దశల్లో పనులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

నిధులు ఉన్నా.. నిలిచిపోయిన పనులు

రెండో విడత నాడు-నేడు పనుల్లో భాగంగా నేటికీ ఆయా పాఠశాలల పేరెంట్స్ కమిటీల అకౌంట్లలో రూ.4.60 కోట్లు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిని కేవలం మైనర్ రిపేర్స్‌కు మాత్రమే వినియోగిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయినా పనులపై దృష్టి సారించలేదు. పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాడు-నేడు పనులు ఈ విద్యాసంవత్సరం పూర్తయ్యే నాటికైనా పూర్తి చేస్తారా? లేదా? అనే అనుమానం కలుగుతోంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ, టోఫెల్ పరీక్ష విధానం తదితర వాటికి టీడీపీ ప్రభుత్వం మంగళం పాడింది. ఈ నేపథ్యంలో నాడు-నేడు పనులు కూడా సాగుతాయా? నిలిచిపోతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



బుజబుజనెల్లూరులోని హైస్కూల్‌లో నిలిచిన పనులు

రెండో విడత పనులకు రూ.190.45 కోట్లు విడుదల

జిల్లాలో రెండో విడతలో ఎంపికైన 1,356 భవనాల్లో 867 ప్రాథమిక, 136 ప్రాథమికోన్నత, 247 ఉన్నత పాఠశాలలు, 106 అంగన్‌వాడీ కేంద్రాలు, ఒక డైట్, ఒక బీఈడీ కళాశాల ఉన్నాయి. వీటిల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.466.94 కోట్లు నిధులు మంజూరు చేసింది. తక్షణంగా పనుల నిర్వహణకు రూ.190.45 కోట్లు విడుదల చేశారు. నాడు-నేడుకు ఎంపికైన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అదనపు తరగతి గదులు, బాలురు, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్స్, రన్నింగ్ వాటర్, ఆర్వో ప్లాంటు, ప్రహరీ, ఫ్యాన్లు, లైట్లు, కుర్చీలు, బెంచీలు, గ్రీన్‌చాక్ బోర్డు, ఇంగ్లిష్ ల్యాబ్, మేజర్ మైనర్ రిపేర్స్, పెయింటింగ్ తదితర పనులు చేపట్టాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వ హయాంలో శరవేగంగా జరిగిన నాడు-నేడు పనులు.. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు.

ప్రతి రోజు మానిటరింగ్ చేస్తున్నాం

నాడు-నేడు పనులపై ఎంఈఓలు, హెడ్‌మాస్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నాం. జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకుంటున్నాం. ఇప్పటికే అకౌంట్లలో డబ్బులు ఉన్న పాఠశాలల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఆయా పనులకు సంబంధించి ఇనుము, ఇసుక, సిమెంట్, ఎలక్ట్రికల్, ఫర్నీచర్ తదితర వస్తువలు జిల్లాకు నేరుగా వస్తున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– ఉషారాణి, ఏపీసీ, సమగ్రశిక్ష

అవుట్ సోర్సింగ్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి




ధర్నా నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం కొండాయపాళెంగేట్ సెంటర్‌లో ఉన్న సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఐటీడీఏ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణ, తార మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, మెగా డీఎస్సీలో గిరిజన గురుకులంలోని టీచర్ పోస్టులను మినహాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గిరిజన గురుకులాల్లో 95 శాతం మంది ఉపాధ్యాయులు అవుట్ సోర్సింగ్ పద్ధతిలోనే పని చేస్తున్నారన్నారు. మెగా డీఎస్సీలో గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలల్లో టీచర్ పోస్టులను మినహాయించాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగేంత వరకు విధులు బహిష్కరించి పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజిస్టర్ చేసుకోని స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): జిల్లాలో పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ చేసుకోకుండా నిర్వహిస్తున్న అల్ట్రాసౌండ్, సీటీస్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఎకో, బి-స్కాన్ సెంటర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య హెచ్చరించారు. శనివారం నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం జరిగింది. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు చట్టాలకు లోబడి నిర్వహించుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లింగనిర్ధారణ చేయరాదన్నారు. స్కాన్ యంత్రాల వివరాలు, వాటిని ఉపయోగించే వైద్యుల వివరాలు జిల్లా సంబంధిత అథారిటీ జారీ చేసిన పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో సరిపోవాలన్నారు. ప్రతి గర్భిణీ వివరాలను ఆన్‌లైన్‌లో ఫారం-ఎఫ్‌లో నమోదు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లను విస్తృతంగా తనిఖీ చేసేందుకు 10 మంది జిల్లా ప్రోగ్రామింగ్ అధికారులను నియమించామన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పీడీయాట్రిషన్ డాక్టర్ సర్దార్ సుల్తానా, గైనకాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ కిరణ్, డాక్టర్ మయూరి, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, డివిజనల్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్, డెమో అధికారి కనకరత్నం, ఎన్‌జీఓలు కవితారెడ్డి, శ్రీనివాసరావు, కుసుమకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

ఊర్జవీర్‌లో భాగస్వాములు కావాలి

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఊర్జవీర్ పథకంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ రిజిస్ట్రేషన్ చేసుకుని భాగస్వాములు కావాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ ఊర్జవీర్ వెబ్ పేజీలోకి వెళ్లి రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేసి పేరు, ఈ మెయిల్, అడ్రస్, ఫోన్ నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అనంతరం కేవైసీ పూర్తి చేసి ఆధార్, పాన్‌కార్డ్, బ్యాంకు అకౌంట్ నంబరు తెలియజేసిన అనంతరం లాగిన్ కావాలని, ఈ రిజిస్ట్రేషన్ కోసం బ్యాంకు ఖాతా నుంచి రూ. 21 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు వాడే విద్యుత్‌లో 15-25 శాతం ఆదా చేసే ఎలక్ట్రికల్ పరికరాలను వినియోగించేలా వినియోగదారులను ప్రభావితం చేయాలని, దీంతో ప్రతినెలా నిర్దేశించిన నగదును బ్యాంకు ఖాతా ద్వారా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ అకౌంట్‌లో జమవుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళల్లో వ్యాపార నైపుణ్యాభివృద్ధి పెంపు

నెల్లూరురూరల్: జిల్లాలోని గ్రామ సమాఖ్య, మండల సమాఖ్య, జిల్లా సమాఖ్య సహకార సంఘాల్లోని మహిళలకు వ్యాపార దక్షత, నైపుణ్యాభివృద్ధి కల్పించాలని జిల్లా సహకారశాఖ అధికారి బి.గుర్రప్ప పిలుపునిచ్చారు. 71వ అఖిలభారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా శాఖాధికారి కార్యాలయంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ కామాక్షి ఆధ్వర్యంలో వ్యాపార దక్షిత, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధిలో మహిళల సహకార సంఘాల పాత్రపై అవగాహన కల్పించారు. మహిళలు బృందాలుగా ఏర్పడి చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా ప్రపంచ మార్కెట్లో విక్రయించాలని కోరారు.

కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా బీసీ వెల్ఫేర్ ఇన్‌చార్జి అధికారి ప్రసూన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీలకు అందిస్తున్న డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ వెల్ఫేర్ ఇన్‌చార్జి అధికారి ప్రసూన కోరారు. నగరంలోని ఆర్టీసీ సమీపంలోని బీసీ స్టడీ సర్కిల్‌ను శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఆర్ఐఓ శ్రీనివాసులు డీఎస్సీ శిక్షణకు వచ్చిన అభ్యర్థులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. పోటీ పరీక్షలకు బయట కోచింగ్ తీసుకునేందుకు చాలా ఖర్చు అవుతుందని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కోచింగ్ పేద అభ్యర్థులకు ఒక వరం లాంటిదన్నారు. ఇప్పటి వరకు తల్లిదండ్రుల సహాయంతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న మీరు ప్రభుత్వ సహాయంతో కోచింగ్ తీసుకుని ఉద్యోగ సాధనే లక్ష్యంగా కష్టపడి చదవాలన్నారు. కోచింగ్ సెంటర్లో ఇచ్చే సూచనలు, మెటీరియల్‌ను శ్రద్ధగా చదవాలన్నారు. కుట్టి కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు లతీఫ్‌కుట్టి, కుసుమకుమారి అభ్యర్థులకు పోటీ పరీక్షలో నెగ్గేందుకు మెలకువలను తెలియజేశారు. తొలి రోజు సుమారు 50 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సోమవారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణాలో మాట్లాడుతున్న జిల్లా బీసీ వెల్ఫేర్ ఇన్‌చార్జి అధికారి ప్రసూన

గిరిజన విద్యార్థులకు విద్యే ఆస్తి

- ఈఎంఆర్ఎస్ విద్యార్థుల ప్రధాన సమస్యలు వారంలో పరిష్కారం
- సమాజంలో గౌరవంగా జీవించాలంటే కష్టపడి చదవాలి
- హిందీ పండిట్ల నియామక సమస్య ప్రభుత్వ దృష్టికి
- ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్



చంద్రశేఖరపురం ఈఎంఆర్ఎస్ విద్యార్థుల సమస్యలు ఆరా తీస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్

కొడవలూరు: ఈఎంఆర్ఎస్‌లో ఉన్న వారంతా గిరిజన బిడ్డలే అని, వారికి ఆస్తి విద్యేనని గుర్తించుకోవాలని ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ స్పష్టం చేశారు. మండలంలోని చంద్రశేఖరపురంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల (ఈఎంఆర్ఎస్), కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని నెలకొన్న సమస్యలను ఆయన స్వయంగా పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యమున్న గిరిజన బిడ్డల తల్లిదండ్రులు తమ పిల్లలు తమలాగా బతక కూడదని ఈఎంఆర్ఎస్‌లో చదివిస్తున్నారని, వారి కలలు సాకారం చేయాల్సిన బాధ్యత మీపై ఉందని విద్యార్థులకు సూచించారు. పేపర్ బాయ్‌గా ప్రస్థానం ఆరంభించిన అబ్దుల్‌కలామ్ రాష్ట్రపతిగా, సైంటిస్ట్‌గా ఎదిగారని, అంటరాని సమాజంలో నుంచి వచ్చిన అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారని గుర్తు చేశారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని, పాఠశాలలోని సమస్యలు విద్యకు ఆటంకం కాకూడదని చెప్పారు. ఈఎంఆర్ఎస్‌లో ఫ్యాన్‌లు, లైట్‌లు పనిచేయడం లేదని, వారంలోగా పునరుద్ధరించాలని ప్రిన్సిపల్‌కు స్పష్టం చేశామన్నారు. ప్రధాన సమస్యలను వారంలోగా పరిష్కరిస్తామని చెప్పారు. పాఠశాలలో నీటి సమస్య ఉందని, బక్కెట్లలో పట్టుకుని బాత్ రూమ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్ సహకారంతో వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. మినరల్ వాటర్‌ప్లాంట్ మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. భోజనం నాణ్యత మెరుగు పరచాలని విద్యార్థులు కోరడంతో అందుకు అవసరమైన చర్యలు తీసుకొంటానని చెప్పారు. హిందీ పండిట్ల నియామక సస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఈఎంఆర్ఎస్ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో నడుస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా కేంద్రం దృష్టికి తీసుకుపోయి పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ పరిమళ, తహసీల్దారు కె.స్ఫూర్తి, ఎంపీడీఓ, ఎంఈఓలు ఏవీ సుబ్బారావు, జి.వసంతకుమారి, ఏఓ లక్ష్మి, హౌసింగ్ ఏఈ ముక్తార్ భాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులు ఉన్నత స్థితికి ఎదగాలి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని గిరిజనులు ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. శనివారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా యానాది కుటుంబాలు ఉన్నాయని, వారికి ఇప్పటికీ ఆధార్, రేషన్, ఓటర్ ఐడీ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు లేవన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న అనేకమైన సంక్షేమ పథకాలకు మూలాధారమైన ఇటువంటి కార్డులు లేకపోవడంతో అర్హతలు ఉండి కూడా వారికి సంక్షేమం అందడం లేదన్నారు. గిరిజనుల కోసం ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఆధార్ కార్డులు అందించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 40 శాతం మంది గిరిజనులకు జాబ్ కార్డులు లేవన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, విచారణలో జాప్యం తగదని, ఆయా కేసుల్లో బాధితులకు నష్టపరిహారం సైతం సత్వరమే అందించాలన్నారు. ఇటువంటి కేసుల విషయంలో కోర్టులకు హాజరయ్యే బాధితులకు రవాణా ఖర్చులు సైతం చెల్లించాలన్నారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలన్నారు. డాక్టర్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ ఒక్క రోజు వర్క్ షాపులో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పరిమళ, గిరిజన నాయకులు పెంచలయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ ఆస్పత్రికి రూ.ఐదు లక్షల విరాళం



నెల్లూరు(అర్బన్): పొదలకూరు రోడ్డులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కేన్సర్ ఆస్పత్రికి రూ.ఐదు లక్షల విరాళాన్ని దాతలు ప్రకటించారు. ఈ క్రమంలో ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును కేన్సర్ ఆస్పత్రి జనరల్ మేనేజర్ భక్తవత్సల రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావుకు సత్యాస్ బ్లూ థింకింగ్ ఈక్విటబుల్ సొసైటీ ట్రస్ట్ చైర్‌పర్సన్ యాచమనేని బృంద, పాకాల శ్రీవల్లి, పాకాల శ్రీకాంత్, చేడిమాల ఉమారాణి, చేడిమాల విజయకుమార్ శనివారం అందజేశారు. రేడియోథెరపీ బ్లాక్ అభివృద్ధికి వినియోగించాలని కోరారు. డాక్టర్ లక్ష్మి, రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, ఎమ్సీ మెంబర్లు వాకాటి విజయకుమార్‌రెడ్డి, యాలమూరి రంగయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరి పంట పరిశీలన



సీతారామపురం: మండలంలోని గంగవరంలో ఇటీవల కురిసిన వర్షాలతో నేల వాలిన వరి పంటను మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొలంలో నీరు ఎక్కువగా నిలిచి ఉంటే, వెంటనే తీసేయాలని సూచించారు. నష్ట అంచనాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. వీఏఏ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వంటకు నిత్యం తంటాలే

- అంగన్‌వాడీ కేంద్రాల్లో దయనీయ స్థితి
- సక్రమంగా సరఫరా కాని సరుకులు
- కందిపప్పునకు కటకట
- నూనె పరిస్థితీ అంతే

ఉదయగిరి: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వంటకు నిత్యం తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వాస్తవానికి ప్రభుత్వం సరఫరా చేసే సరుకులు ఇక్కడికి సకాలంలో చేరడంలేదు. ప్రతి నెలా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. ఫలితంగా పోషకాల్లేని ఆహారమే చిన్నారులకు దిక్కవుతోంది. దీనికి తోడు కొన్ని ప్రాజెక్టుల్లో సూపర్‌వైజర్ల కొరత, మరికొన్ని చోట్ల ఉన్నా పర్యవేక్షణ కొరవడటంతో లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా అందడంలేదు.

ఐదు నెలలుగా ఇదే దుస్థితి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఐదు నెలల్లో మూడు నెలల పాటు కేంద్రాలకు కందిపప్పును సరఫరా చేయలేదు. దీన్ని అక్టోబర్, నవంబర్‌లో సరఫరా చేశామని అధికారులు చెప్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మరోవైపు జిల్లా వ్యాప్తంగా నూనెను ఈ నెల్లో నేటికీ సరఫరా చేయలేదు. దీంతో అరకొర కూరగాయలతోనే కేంద్రాల్లో వంట చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

నాడెంతో ఘనం

జిల్లాలో 12 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులను సకాలంలో సరఫరా చేసేవారు. ఈ చర్యలతో కేంద్రాల్లో వ్యవహారాలు సాఫీగా సాగేవి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ప్రధానంగా కందిపప్పు, నూనె లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఏమి వండి పెట్టాలో అర్థం కావడం లేదని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా కూరగాయలకు ఇచ్చే బిల్లులనూ సకాలంలో అందజేయడంలేదు. ఈ పరిణామాల క్రమంలో అంగన్‌వాడీల్లో వంట భారంగా మారింది. ఆర్థిక స్తోమత ఉన్న వారు తమ సొంత డబ్బులతో సరుకులను కొనుగోలు చేసి వంట చేస్తున్నారు. అయితే అది లేని వారు మాత్రం ఇబ్బంది పడుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

జిల్లాలో ఇలా..

ప్రాజెక్టులు	12
అంగన్‌వాడీ కేంద్రాలు	2934
చిన్నారులు	24,628
బాలింతలు	12,002
గర్భిణులు	13,204

నూనె ఇంకా రాలేదు



"నూనె ఈ నెల్లో ఇప్పటికీ రాలేదు. త్వరలోనే అన్ని ప్రాజెక్టులకు అందేలా చర్యలు చేపడతాం. గతంలో మూడు నెలలు కందిపప్పు రాలేదు. ఆ తర్వాత ఇచ్చారు. కొన్ని చోట్ల డీలర్ల సమస్యతో కేంద్రాలకు కందిపప్పు చేరలేదు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం.

– హేనాసుజన్, పీడీ, ఐసీడీఎస్

లబ్ధిదారుల గగ్గోలు

కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న బాలింతలు, గర్భిణులకు రోజూ 125 గ్రాముల బియ్యం, 30 గ్రాముల కందిపప్పు, 16 మిల్లీలీటర్ల నూనెను అందించాల్సి ఉంది. ఇలా నెలాకు సరిపడా వారి ఇంటికే ఇవ్వాల్సి ఉంటుంది. అయితే సరుకులు సక్రమంగా రాక వీటిని అందజేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో కార్యకర్తలతో పలువురు లబ్ధిదారులు గొడవపడుతున్న దాఖలాలూ ఉంటున్నాయి. మరోవైపు మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, ఐదు మిల్లీలీటర్ల నూనెతో వంట చేసి కేంద్రంలో అందించాలి. అయితే సరుకుల పంపిణీ సక్రమంగా లేక ఈ ప్రక్రియ అయోమయంగా మారింది. మరోవైపు కొన్ని ప్రాజెక్టులకు సరుకులు సరఫరా కాకపోయినా, అందాయంటూ.. రికార్డులు, యాపుల్లో నమోదు చేయాలంటూ కార్యకర్తలపై ఐసీడీఎస్ అధికారులు ఒత్తిడి తెస్తున్నారని సమాచారం.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	105
లేయర్ (లైవ్)	110
బ్రాయిలర్ చికెన్	196
బ్రాయిలర్ స్కిన్‌లెస్	220
లేయర్ చికెన్	187

20న వాహనాల వేలం

ఆత్మకూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసుల్లో స్వాధీనం చేసుకున్న రెండు వాహనాల వేలాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నామని ఎస్సై జిలానీ శనివారం తెలిపారు. బజాజ్ పల్సర్ బైక్, టయోటా ఇటియోస్ కారును స్థానిక పోలీస్‌స్టేషన్లో తహసీల్దార్ సమక్షంలో వేలం వేయనున్నామని చెప్పారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి

- జెడ్పీ సీఈఓ మోహన్‌రావు

మనుబోలు: ప్రజల భాగస్వామ్యంతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, సెక్రటరీలు, సచివాలయాల సిబ్బంది, వీఓఏలు, ఆరోగ్య సిబ్బంది తదితరులకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయిలో జరిగిన పురోగతి ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కోసం నిర్దేశించిన తొమ్మిది అంశాలను సాధించే దిశగా ప్రణాళికలుండాలని చెప్పారు. గ్రామసభలను నిర్వహించి, ప్రజల భాగస్వామ్యంతో పనులను గుర్తించాలని, అత్యవసరమైన పనులను 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టాలని సూచించారు. ఎంపీడీఓ జలజాక్షి, ఈఓపీఆర్డీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహన్‌రావు

పక్కాగా క్షయ నివారణ చర్యలు

నెల్లూరు(అర్బన్): క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రణాళికబద్ధంగా సేవలందించాలని ఏడీ ఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. నగరంలోని డీఎఫ్ఐటీ ఎన్జీఓ సమావేశ మందిరంలో టీబీ నివారణ సిబ్బందితో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. దగ్గు, జ్వరం రెండు వారాల పాటు ఉంటే అలాంటి వారిని అనుమానితులుగా భావించి టీబీ పరీక్షలు చేయించాలని కోరారు. పరీక్షలను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. పౌష్టికాహారం కోసం టీబీ రోగులకు ఇప్పటి వరకు ఇస్తున్న మొత్తాన్ని రూ.వెయ్యికి పెంచి ప్రభుత్వం త్వరలో అందజేయనుందని తెలిపారు. ఈ నగదు వారి ఖాతాల్లో జమయ్యేలా చూడాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.



పత్రికలతోనే సమాజ చైతన్యం

నెల్లూరు రూరల్ / నెల్లూరు (టౌన్): సమాజంలో చైతన్యం కలిగించి.. ప్రజల సమస్యలను పరిశీలించేది పత్రికలు, విలేకరులేనని సమాచార శాఖ డీడీ సదారావు పేర్కొన్నారు. జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాయపాళెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు తదితరాలను ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడారు. మీడియా లేని సమాజాన్ని ఊహించుకోలేమని పేర్కొన్నారు. చిన్నతనం నుంచే పత్రికలను పఠించడం ద్వారా విజ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రమేష్‌బాబు, సామ్నా ప్రధాన కార్యదర్శి గడ్డం హనోక్, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, సోమేశ్వరరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలను అందజేస్తున్న సదారావు తదితరులు

నేత్రపర్వంగా లక్ష్మీనృసింహుడి కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



హాజరైన భక్తులు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణాన్ని జరిపారు. ఊంజల్‌సేవను సాయంత్రం నిర్వహించారు.

సోమేశ్వరాలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

సోమశిల: సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వరాలయ పునర్నిర్మాణానికి సంబంధించిన భూమి పూజను వేడుకగా శనివారం నిర్వహించారు. శృంగేరి పీఠ జగద్గురువు విధుశేఖరభారతి హాజరయ్యారు. రూ.8.4 కోట్ల దేవదాయ శాఖ నిధులతో చేపట్టనున్న పునర్నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని వీరు ఆవిష్కరించారు. అనంతరం విధుశేఖరభారతి అనుగ్రహభాషణ చేశారు. ఆదిశంకరాచార్యులు కృషి ఫలితంగా హిందూ ధర్మం గొప్పగా విరాజిల్లుతోందని చెప్పారు. ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని కాంక్షించారు. అనంతరం ఆనం మాట్లాడారు. ఆలయ పునర్నిర్మాణానికి శృంగేరి పీఠం తరఫున రూ.1.16 లక్షల భాగస్వామ్యాన్ని అందించి స్వామి వారు ఆశీస్సులు అందించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాంక్షించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, దేవదాయ శాఖ ఈఓ ప్రసాద్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు ఉప్పల సోమసుందరమూర్తి, ఉప్పల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

గాయపడిన యువకుడి మృతి

ముత్తుకూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు శనివారం మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. పల్లూరు పంచాయతీలోని బండ్లపాళేనికి చెందిన పల్లి కొండ నీలకంఠరావు (36) నేలటూరులోని ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నారు. డ్యూటీ ముగించుకొని ఇంటికి ఆగస్ట్ 29న బయల్దేరగా, పిడతాపోలూరు చెరువు సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

మహిళపై దాడి

నెల్లూరు(క్రైమ్): పాత గొడవల నేపథ్యంలో మహిళపై దాడి చేసిన ఘటన నగరంలోని సప్తగిరి కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. సప్తగిరికాలనీలో నివాసం ఉంటున్న వెంకటనాగలక్ష్మి కుటుంబానికి పార్కింగ్, పూల మొక్కల విషయమై పక్కింట్లో ఉంటున్న వెంకటేష్ కుటుంబంతో పాతగొడవలున్నాయి. ఈ నేపథ్యంలో తన ఇంటి ముందు ఆమె శుభ్రం చేసుకుంటుండగా, దాడికి పాల్పడి చంపుతామని వెంకటేష్ బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు.

పాలిచెర్లపాడులో వ్యక్తి ఆత్మహత్య



వెంకటాచలం: మండలంలోని పాలిచెర్లపాడులో గల అడవిలో చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనను స్థానికులు శనివారం గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తిని నెల్లూరులోని జాకీర్ హుస్సేన్‌నగర్‌కు చెందిన గండికోట సురేంద్రబాబు (36)గా గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇసుక టిప్పర్ల స్వాధీనం

ఆత్మకూరు: ఇసుకను అక్రమంగా డంప్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న రెండు టిప్పర్లను ఆత్మకూరు పోలీసులు శనివారం స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వివరాలు.. పట్టణ పరిధిలోని బృందావనం కాలనీ ప్రాంతంలో గల నిమ్మతోటలో ఇసుకను కొద్ది రోజులుగా అక్రమంగా డంప్ చేశారు. అక్కడి నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే సమాచారంతో దాడులను పోలీసులు తెల్లవారుజామున చేపట్టారు. టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు.

నిమ్మ ధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి	రూ.45
నన్నవి	రూ.35
పండ్లు	రూ.20

